# "కన్నవాళ్ళు"

చెన్ను సుశీలారామం



"అమ్మా సుగుణా... నేనలా సుబ్బారాయుడి దగ్గర కెళ్ళొస్తానమ్మా... కాస్త నా కండువా ఇలా అందుకుంటావా"? మెల్లిగాలేచి నిలబడ్డాడు రామనాధం. లోపల్నుండి కండువా తెచ్చి తండ్రి కిచ్చింది సుగుణ. అతను వీధి గుమ్మం దాటగానే... తలుపులు మూసి, లోనికెళ్ళింది.

ఎండతీవ్రత తగ్గినా.. దాని తాలూకు వేడి, రోడ్డు మీద పొగలు గక్కుతున్నట్టుంది. కాలి మడమ దగ్గర, బొటనవేలి దగ్గర.. అరిగిపోయి, చిల్లులుపడివున్న జోళ్ళు రామనాధం పాదాల్ని ఎండవేడికి చురుక్కుమనిపిస్తోంది. పై కండువాతో పదేపదే ముఖం తుడుచుకుంటూ ఫర్లాంగుదూరాన్ని కష్టం మీద నడిచి..సుబ్బారాయుడింటికి చేరాడు.

స్నేహితుడ్ని సాదరంగా ఆహ్వానించి, లోనికి తీసుకెళ్లాడు సుబ్బారాయుడు.

"రారా..ఇలా కూచో... ఏంటీ మరీ ఇంత నీర్సంగా కనిపిస్తున్నావు? ఒంట్లోగాని బావుండలేదేవిట్రా?"

"ఒంట్లో కాదురా.. ఇంట్లో బావుండలేదు. ఒరే

సుబ్బారాయుడూ..నీ ఇంట్లో అడుగుపెడితే.. ప్రాణం లేచొస్తుంది. మనసుకి ప్రశాంతంగా అనిపిస్తుంది. ఒరే కాసిని మంచినీళ్ళు తీసుకురారా.." స్థిమితంగా..ఫేన్ కింద సోఫాలో కూర్చున్నాడు రామనాథం.

"వట్టి మంచినీళ్ళు కాదురా..ఈరోజు టిఫిన్ కూడా రెడీగానే వుంది. అమ్మా స్వర్ణా.. రామనాథం వచ్చాడు..వాడికి, నాకు టిఫిన్ పట్రామ్మా.." రామనాథం ప్రక్కనే కూర్చున్నాడు సుబ్బారాయుడు.

"అమ్మాయి రాత్రి వచ్చిందిరా.. అల్లుడు కేంప్ వెళ్ళాడు. రావడాన్కి వారంరోజులు పడుతుందట. ఒక్కత్తీ పిల్లలతో వుండలేదని..రాత్రి తీసుకొచ్చి అమ్మాయిని, పిల్లల్ని ఇక్కడ దించివెళ్ళాడు అల్లుడు."

ఇంతలో.. లోపల్నుండి ముద్దులు మూటగడుతూన్న పసిపిల్లలిద్దరు.. "తాతయ్య..తాతయ్యా.." అంటూ అరుస్తూ వచ్చి సుబ్బారాయుడి ఒడిలో చేరిపోయారు. వాళ్ళిద్దర్నీ ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ముద్దాడాడు సుబ్బారాయుడు.

ఇంతలో స్వర్ణ ట్రేలో టిఫిన్ ప్లేట్లు... మంచినీళ్ళు తెచ్చి అక్కడున్న టీపాయ్ మీద పెట్టింది. "నమస్తే మామయ్యగారూ.. బావున్నారా? సుగుణ ఏం చేస్తోందండీ? మీతో తీసుకురావాల్సింది.." అడిగింది స్వర్ణ.

క్షణకాలం ఆమెనే చూస్తూండిపోయాడు రామనాథం. మహాలక్ష్మిలా కళకళ్లాడుతోంది స్వర్ణ. వెంటనే.. తన కూతురు సుగుణ, కళ్ళముందు కదిలి.. నీరసంగా నవ్వాడు.."ఏం చేస్తుందమ్మా.. దానికి ఆ ఇంటి చాకిరీతో.. క్షణం తీరదు. నువ్వొచ్చినట్టు తెలిస్తే.. ఎంత పనున్నా.. తీరికచేసుకుని వచ్చేస్తుంది. రేపు పంపిస్తానమ్మా.."

టిఫిను, కాఫీ తీసుకున్నాక, స్నేహితులిద్దరూ బైటికి బైల్దేరారు... "అమ్మా స్వర్ణా... మేఘలా పార్కుదాకా వెళ్ళొస్తాం. ఈ సిసింద్రీలిద్దర్నీ మాతో పంపిస్తావా?" అప్పుడే పిల్లలిద్దరూ హుషారుగా గెంతుతూ... తాతగారి చేతులు గట్టిగా పట్టేసుకున్నారు.

"ఒద్దు నాన్నా.. మిమ్మల్నిక్కడ స్థిమితంగా కూచోనివ్వరు. ఒరే చిట్టీ... బుజ్జీ... ఇలా వచ్చేయండమ్మా... మనం ఇప్పుడు కన్నబాబు బర్త్‌డేకి వెళ్ళొద్దూ?"

ముందు బిక్కముఖాలేసుకున్న పిల్లలిద్దరూ... తాతగార్ని వదిలి... తల్లి దగ్గరకొచ్చేశారు... "తాతయ్యా... మీతో మేం రాము. కన్నబాబు బర్త్‌డేకెళ్ళి... హేపీ బర్త్‌డే టూ యూ... పాడి... కేకులు, చాక్‌లెట్లు తెచ్చుకుంటాం... మీరు వెళ్ళిపొండి.."

* * *

స్నేహితులిద్దరూ, పార్కులో, బెంచీ మీద కూచున్నారు. "ఒరే రామనాథం.. ఏవిట్రా విశేషాలు? చెల్లెమ్మ ఆరోగ్యం ఎలా వుంటోంది?"

తప్పుచేసిన వాడిలా, తలదించుకున్నాడు రామనాథం. "ఏంట్రా సమాధానం చెప్పవేం?" రెట్టించాడు సుబ్బారాయుడు.

"రామేశ్వరిని లేడీ డాక్టరుకి చూపించాలిరా.. చేతిలో, చిల్లిగవ్వలేదు. అందుకే నీ దగ్గరకొచ్చాను.." మాటలు కూడదీసుకుంటూ చెప్పాడు రామనాథం.

ఆశ్చర్యంతో సుబ్బారాయుడి నోటంట మాటరాలేదు. కాస్సేపు రామనాథాన్ని చూస్తూన్నకొద్దీ కోపమూ, జాలీ కలుగుతున్నాయి అతనికి..నోరిప్పి అతన్తో మాట్లాడ్డానిక్కూడా మనస్కరించలేదు సుబ్బారాయుడికి.

స్నేహితుని మౌనం ఎంతగానో బాధించింది రామనాథాన్ని. "ఒరే సుబ్బారాయుడూ... నువ్వు నన్ను మనసులో ఎంత చీదరించుకుంటున్నదీ నాకు తెలుసు రా.. కాని ఏం చెయ్యను చెప్పు? అంతా విధి ప్రేరణ. మనం నిమిత్తమాత్రులం.."

"చాల్లే.. నోర్ముయ్యింక.." తనని తాను కంట్రోలు చేసుకుంటూ కటువుగా అన్నాడు సుబ్బారాయుడు." అంతా నీ చేతులారా చేసుకుంటూ..విధి మీదకు నెడతావేం? ఏడాదికో కాన్పు అవుతూంటే.. నీ భార్య ఎంతకాలం బ్రతుకుతుందనుకున్నావు. పోయినవాళ్లు పోగా.. ఐదుగురు సంతానం మిగిలారు. వాళ్లు సరిపోరా నీకు? ఐనా మనవల్ని ఎత్తాల్సిన ఈ వయసులో మీ ఆవిడ్ని పురిటిమంచమెక్కిస్తున్నావు.. నీకు సిగ్గుగా లేదట్రా?"

దేనికీ నోరిప్పలేదు రామనాథం. అతడ్నలా చూసే సరికి, నిప్పుల మీద నీళ్ళు గుమ్మరించినట్టు... చప్పున తగ్గిపోయాడు సుబ్బారాయుడు. "ఒరే రామనాథం... ఏవిట్రా ఇది? నీకు ఎన్ని సార్లు చెప్పాన్రా... పిల్లలు కలక్కుండా చూసుకోమని? కృష్ణా రామా అనుకుంటూ ప్రశాంతంగా, జీవితంగడపాల్సిన ఈ వయసులో.. వున్న పిల్లల బాధ్యతలే ఇంకా ఓ దరికి చేర్చలేదనుకుంటుంటే.. మళ్లీ కొత్తగా.. అదనపు బరువుల్ని నెత్తికెక్కించుకుంటున్నావా? పిల్లల్ని కనే వయస్సా మనది? పెళ్లికెదిగిన పిల్లలు ఇంట్లో తిరుగుతూంటే..నువ్విలాంటి పరిస్థితి కల్పించడం.. మీ ఆవిడకెంత ఇబ్బందికరంగా వుంటుందో, ఆలోచించావా? ఐనా.. నా కంఠ శోషగాని ..నీకు చెప్పినా, ఆ బండరాయికి చెప్పినా ఒక్కటే. ఏనాడు నా మాట వినిపించుకున్నావు గనక? కాని ఏ మనిషైనా..కొంతవరకే బరువూ బాధ్యతల్ని మొయ్యగలడు. మన శక్తిని బట్టి దాన్ని నిర్ణయించుకోవాల్సింది మనమే. శక్తికి మించిన బరువుల్ని నెత్తికెత్తుకున్నామా.. తిరిగి పైకి లేచి నిలబడే ప్రశక్తే వుండదు. ఇప్పుడు నువ్వు అలాంటి తెలివిమాలిన పనే చేస్తున్నావు."

అతడి రెండు చేతులూ పట్టుకుని బాధపడ్డాడు రామనాథం. "ఒరే..నిజంగా నేను పరమమూర్ఖుడ్నిరా. చేతులారా నా జీవితాన్ని పాడుచేసుకుంటున్నాను. నా కూతురి జీవితం పాడుచేశాను. ఇప్పుడేవనుకుని ఏమిటి లాభం? నా ఖర్మ ఎలావుంటే అలా జరుగుతుంది."

"అలాంటి మెట్టవేదాంతం చెబుతుంటేనే... నాకు తిక్కరేగుతుంది. ఏదన్నా చెయ్యాలనుకుంటే, చేతల్లో చూపించు. ఇప్పటికే నీకు నేను అరిగిపోయిన రికార్డులా..చెప్పి చెప్పి విసిగిపోయాను. ఇంక నీకు ఏదీ చెప్పే ఓపిక నాకు లేదు. నీ ఇష్టం వచ్చినట్టు తగలడు.. ఇదిగో ఈ ఐదొందలు నీ దగ్గరుంచు.." జేబులోంచి

## అందం అంటే...?

అందం అంటే -
ప్రాతఃకాల సమీరం
పక్షుల కిలకిలారావం
తుషారంలో జలకాలాడిన
విరిసీ విరియని కుసుమం
అందం అంటే -
పచ్చని గరికను వెచ్చగ తాకే
బాలభానుని బంగరు కిరణం
అందం అంటే -
గ్రీష్మతాపాన్ని గర్హిస్తూ
చల్లని జల్లును కురిపిస్తూ
కమ్మని వాసన కలిగిస్తూ
కురిసే తొలకరిజల్లు
అందం అంటే
ప్రచండ మార్తాండుని కప్పేస్తూ
నల్లనల్లగా క్రమ్ముకుంటూ
పరస్పరం కుమ్ముకుంటూ
తటిల్లతలను పుట్టిస్తూ
వర్షించే మేఘం

\- బాణగిరి శ్రీవాణి

డబ్బుతీసి, రామనాథం చేతిలో పెట్టాడు సుబ్బారాయుడు.

ఆరోజు తనకు భోజనం వడ్డిస్తోన్న కూతురు సుగుణను చూసేకొద్దీ... రామనాథం మనసు వికలమైపోయింది. కళ తప్పిన ముఖం... శుష్కించిన శరీరం, మాసిపోయిన అతుకుల బొంతలాంటి చీర... వేలిముడి... నిండా పాతికేళ్ళులేని సుగుణ ఏభై ఏళ్ళదాన్లావుంది. ఆమె ఈడుదైన సుబ్బారాయుడు కూతురు స్వర్ణ, రామనాథం కళ్ళముందు కదిలింది.

సుబ్బారాయుడు, రామనాథం మంచి స్నేహితులు. ఒకే ఈడువాళ్ళైన తమ కూతుళ్ళిద్దరకూ... ఆరునెలలు ఇంచుమించులో... పెళ్ళిళ్ళు జరిపించారు. ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తూన్న సుబ్బారాయుడు, రామనాథం అల్లుళ్ళిద్దరూ... ఆ ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదంలో... ఘోరంగా మరణించారు. రెండు కుటుంబాలవాళ్ళూ... గుండెలు పగిలేలా, ఏడ్చారు. ఎవరు ఏడ్చినా... ఎవరు నవ్వినా... ఎవరెలాపోయినా కాలం ఆగదు కదా.. సంవత్సరకాలం గిర్రున తిరిగొచ్చేసింది. ఈలోపు తన కూతురి పరిస్థితంతా వివరిస్తూ పేపర్లో ప్రకటనిచ్చాడు సుబ్బారాయుడు. అందుకిష్టపడి... స్వర్ణను పెళ్లాడుతానంటూ వచ్చిన ఆదర్శభావాలు గల యువకుడ్ని తన అల్లుడిగా చేసుకున్నాడు. సుగుణ జీవితం నాశనం చెయ్యొద్దని... ఆమెకూ పునర్వివాహం చెయ్యమని... వరుడ్ని తాను వెదికి తెస్తాననీ... ఎంతగానో నచ్చచెప్పాడు రామనాథాన్కి సుబ్బారాయుడు. తాడెత్తున లేచాడు రామనాథం.

అతడి ఆలోచన మరోలా వుంది. కూతురికి పునర్వివాహం జరిపిస్తే..ఆమెకు మొదటి భర్తద్వారా సంక్రమించిన ఆస్తి చేజారిపోతుందని..ఆ..పునర్వివాహాన్కి అందంగా ఎన్నో అభాండాలు వేసి, అవాంతరాలు అంటగట్టి.. కూతురి పెళ్లి విషయంలో, మరెవ్వర్నీ నోరెత్తనివ్వ లేదు. ఏటేటా.. కాన్పుల్తో... రోగిష్టిదైన భార్య... గంపెడు సంసారం... ఆదాయానికి మించి... అడ్డు అదుపులేని ఖర్చులు పెరగడంతో ఆస్తంతా, హారతి కర్పూరంలా కరిగిపోయింది. ప్రస్తుతం కూతురి గురించి దిగులు పట్టుకుందతనికి. స్వర్ణలాగా.. కళకళ్లాడుతూ, నవ్వుతూ, తుళ్లుతూ, తిరగాల్సిన దాని జీవితాన్ని... స్వార్థంతో కుచ్చితంగా ఆలోచించి సర్వనాశనం చేశాడు... తను, తన భార్య ఎంతకాలం బ్రతుకుతారు? ఆనక... సుగుణ పరిస్థితి... మిగిలిన పిల్లల

## మీనాకుమారిగా ఐస్!

ఐశ్వర్యారాయ్ 'సాహెబ్ బీవీ అవుర్ గులామ్' సినిమాలో మీనాకుమారి పోషించిన పాత్రను పోషించనుంది. ప్రీతీష్ నంది నిర్మిస్తున్న ఈ చిత్రం ఒకప్పటి గురుదత్ సినిమాను పోలి ఉంటుంది. సంజయ్‌లీలా భన్సాలీ 'దేవదాస్' మాదిరిగా ఐశర్య 'సాహెబ్ బీవీ అవుర్ గులామ్'లో యాక్ట్ చేస్తోంది. దేవదాస్ పార్వతిలా, ఈ సినిమాకు కూడా ఐస్ పూర్తి న్యాయం చేకూర్చగలదని బాలీవుడ్ భోగట్టా.



పరిస్థితి ఏమిటి? వయసులో వున్న పెద్ద కూతురు కళ్లెదుట కట్టెలా తిరుగుతూంటే... వయసుడిగిన తాము ఏటేటా పిల్లల్ని కంటున్నారు... ఎంత సిగ్గుచేటు... పైకి చెప్పకపోయినా... సుగుణ మనసులో తమని ఎంత చీదరించుకుంటోందో... దీనికేదో పరిష్కారం ఆలోచించాలి..

ఆలోచిస్తూనే రామనాథం భోజనం అయ్యిందనిపించి లేచి చేతులు కడుక్కుని, కండువాతో తుడుచుకుంటూ భార్య దగ్గరకెళ్లాడు. భర్తను చూసి నీర్సంగా లేచి కూచుంది జానకమ్మ. "ఏవండీ.. ఈ వేవిళ్ల బాధ ఈసారి మరీ ఎక్కువగా వుందండీ.. మంచినీళ్ళు తాగినా.. ఇమడ్డంలేదు.. డాక్టరు దగ్గర కెళ్తే ఏదన్నా మందో మాకో ఇస్తారు.. డాక్టరు దగ్గరకు సన్నెప్పుడు తీసుకెళ్తారండీ..?"


భార్య పక్కనే కూచున్నాడు రామనాథం. "జానకీ నిన్ను ఇప్పుడే, డాక్టరు దగ్గరకు తీసుకెళ్తాను గాని... ఆ విషయం అలా వుంచు... నీకో మాట చెప్పాలనుకుంటున్నాను జానకీ... మన సుగుణకు ఎవర్నైనా మంచి వరుడ్ని చూసి వివాహం జరిపిద్దాం..." వంటగదిలోవున్న సుగుణ చెవిని పడ్డాయామాటలు. ఆమె హృదయం చిత్రంగా స్పందించింది. మనసు విహంగమై తేలిపోసాగింది.

"అప్పుడే సుబ్బారాయుడు చెప్పినట్టు వినకపోవడం ఎంతో మూర్ఖత్వం అనిపిస్తుందే.. వాళ్ల స్వర్ణను చూసి మన సుగుణను చూస్తుంటే.. నా కడుపు తరుక్కుపోతోందనుకో. కళకళ్లాడుతూ కాపురం చేసుకుంటూ, పిల్లాపాపల్తో వుండాల్సిన దాని జీవితాన్ని చేతులారా పాడుచేశామనిపిస్తోంది. సాయంత్రం సుబ్బారాయుడి దగ్గరకెళ్ళి ఎవరైనా మంచి కుర్రాడ్ని చూడమని చెబుతాను."

భర్త మాటలింకా పూర్తిగాకుండానే..అతని మీద గయ్యిమంటూలేచింది జానకమ్మ. "చాల్చాల్లే చెప్పొచ్చారుగాని.. వూరుకోండింక. ఏవరైనావింటే నవ్విపోవడమేగాక, మన ముఖాన్ని వూస్తారు. మొగుడు చచ్చి ముండమోసి ఇంతకాలమయ్యాక దానికి మళ్ళీ పెళ్ళిచేస్తానంటున్నారా? ఇలాంటి పని మన ఇంటా వంటా వుందా? నలుగుర్లో తలెత్తుకు తిరగాలని లేదా మీకు? అదీగాక.. దానికి పెళ్లిచేసి టింగురంగామంటూ అత్తారింటికి పంపేస్తే.. ఈ కొంపలో చాకిరీ ఎవరు చేస్తారు? మీ పిల్ల పిశాచాల్ని ఎవరు సాకుతారు? మళ్లీ ఎప్పుడైనా, దాని పెళ్ళి మాటెత్తారా.. నేను నూతిలో దూకి చస్తాను.. జాగ్రత్త."

తల్లి మాటలు సుగుణ నెత్తిన పిడుగుల్లా పడ్డాయి. గబగబా వంటగదిలో పని ముగించుకుని... పెరట్లోకెళ్ళి... మామిడి చెట్టునీడలో... ఉసూరుమంటూ చతికిలబడింది. ఆమె మనసు పరిపరివిధాల పోతోంది.

"తండ్రి తనకు పెళ్ళిచేస్తానంటుంటే..తల్లి అలా అంటుందేమిటి? తన సుఖం కంటే కూడా ఆమెకు ఇంటి చాకిరీ, పిల్లల చాకిరీయే ముఖ్యమన్నమాట. తను పెళ్లి చేసుకుని సుఖపడకూడదు. ఇలాగే ఏ సరదా.. సంతోషం లేకుండా.. జీతంబత్తెంలేని పనిమనిషిలా వెట్టిచాకిరీ చేస్తూ బతుకు తెల్లార్చుకోవాలి. తనకింక ఈ జన్మలో సుఖపడే యోగంలేదు. స్వర్ణలాగా తనకూ మళ్ళీ పెళ్ళిచేసుకుని హాయిగా బతకాలనుంది. కాని... కాని... ఇంట్లో ఎవ్వరూ



తనని పెళ్ళివూసే ఎత్తరు... ఆఖరికి... సిగ్గువిడిచి తనకు పెళ్లిచేసుకోవాలనుందని.. తల్లితో తన మనసులోని మాట చెప్పుకుందామనుకుంటోందీ మధ్య... ఇంతలోకి తండ్రి తన పెళ్ళి మాటెత్తితే ఎంతో పొంగిపోయింది. కాని.. తల్లి ఆంతర్యం ఇలాంటిదని తను కల్లో కూడా వూహించుకోలేక పోయింది. కడుపున పుట్టిన బిడ్డలకోసం, కన్నతల్లి ఎన్నో త్యాగాలు చేస్తుందని ఆఖరికి ప్రాణాన్నైనా పణంగా పెడుతుందని, తను ఎన్నో కథల్లో చదివింది. కాని... తనకు పుట్టిన పిల్లల్నే తమకు ఆహారంగా తినే ఓ రకం పాము జాతి వుందని తనెప్పుడో చదివింది.. అలాంటి రకాలు మనుషుల్లోకూడా వుంటారని.. ఇప్పుడు తన తల్లిద్వారా తెలుసుకోగలిగింది తను.

కడుపున పుట్టిన బిడ్డ సుఖపడకూడదు. తను మాత్రం ఏటేటా బాలింత... చూలింత కావచ్చు. ఛీ, ఛీ ఆమె అసలు ఆడదేనా? తల్లిగా కాకున్నా సాటి ఆడదానిగానన్నా తన బాధనర్థం చేసుకోలేకపోతోందే.., ఇంక తన బతుకు ఇంతేనా?" తనలో తనే కుళ్ళి కుళ్ళి ఏడ్చి గుండెల్లో బరువుదించుకుంది సుగుణ.

❋ ❋ ❋

ఆరోజు స్వర్ణ దగ్గరకెళ్ళింది సుగుణ. స్నేహితురాల్ని చూసి మనసులో.. ఎంతో నొచ్చుకుంది స్వర్ణ. "ఇదేంటే సుగుణా.. నేను క్రితంసారి చూసినప్పటికీ, ఇప్పటికీ, నీలో చాలా మార్పు కనిపిస్తోంది. ఇంట్లో తీరిక లేనన్ని పన్లు ఎన్ని వున్నా..నీ ఆరోగ్యం గురించి కూడా కాస్త పట్టించుకోవాలిగదా? ఈ మధ్య నీ ముఖాన్నెప్పుడైనా అద్దంలో చూసుకున్నావా? నీలో మరీ ఇంత మార్పు ఎలా వచ్చిందే? మరీ విశ్రాంతన్నదే లేకుండా అన్ని పనులూ నెత్తినేసుకుని చేసేస్తున్నావా? నువ్వు మనిషివి... మిషన్‌విగాదూ... ఎలాంటి మిషనైనా... అదే పనిగా పనిచేస్తుంటే.. ఏదోనాటికి ట్రబులొచ్చి మూలపడతాయి.. ఆ విషయం తెలుసుకో.."

## ఎందరో నేహాలు

ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీలో నలుగురు నేహాలు ఉన్నారు. గోల్‌మాల్‌తో ఓ నేహా హిందీ రంగ ప్రవేశం చేస్తే, 'దిల్'తో మరో నేహా, జగపతి బాబు 'ధమ్'తో మరో నేహా ఇంక నేహాధూపియా సంగతి సరే సరి. ఇలా ఒకే పేరుతో ఇంతమంది హీరోయిన్లు ఉంటే ప్రేక్షకులకు ఏ చిత్రంలో నటించింది ఏ నేహో తెలియక తికమకపడే అవకాశం ఉంది. అయినా ఇలా వచ్చి అలా పోయే వాళ్ళకు ఏ పేరయితే ఏంటి?


స్నేహితురాలి మాటల్తో అంతవరకూ సుగుణలో నిగూఢంగావున్న వేదనంతా ఒకసారి పెల్లుబికి పైకి తన్నుకొచ్చేసింది. రెండు చేతుల్తోటి ముఖాన్ని కప్పుకుని భోరుమంది. కంగారు పడిపోయింది స్వర్ణ. చప్పున సుగుణ్ణి తన దగ్గరకు తీసుకుని, ఆమె తలనిమిరింది.

"ఛఛా... ఏమిటే ఇది? ఎప్పుడూలేంది ఎందుకిలా ఏడుస్తున్నావు? అసలు ఏం జరిగిందే? ఇంట్లో ఏవన్నా గొడవా? నాతో చెబితే... నాకు తోచింది చెప్తాను. ఊ ముందా ఏడుపు ఆపు... ఊ...".

స్వర్ణ ఓదార్చడంతో తనని తాను కంట్రోలు చేసుకుని ఇంట్లో జరిగిందంతా చెప్పింది సుగుణ. "సుగుణా... నీ జీవితం వడ్డించిన విస్తరిగాదు. అన్నీ నువ్వే వడ్డించుకోవాలి. ఆఖరికి... విస్తరిగూడా నువ్వే సంపాయించుకోవాలి. అర్థం ఛేసుకున్నావనుకుంటాను.. నీ తల్లిదండ్రులు నీకలాంటి సదవకాశాన్ని అందించలేదు.. అలాంటప్పుడు ఎవరో వచ్చి మనకు ఏదో మేలు చేస్తారని ఎదురుతెన్నులు చూడటం వట్టి అవివేకం. ఎవరి జీవితం వాళ్ళదే... మన ఒంటికి జబ్బుచేస్తే దాని తాలూకు బాధ మనం అనుభవిస్తాంగాని మరొకళ్ళు పంచుకోలేరుగదా? అలాగే.. ఎవరి సుఖం వాళ్ళే వెదుక్కోవాలి. ఎక్కడికైనా భోజనానికి వెళ్ళామనుకో.. అందర్తోబాటు మనమూ కూచుంటాం. మన వరకూ వచ్చేసరికి విస్తళ్ళు ఐపోతాయి. అది తెచ్చి వెయ్యడాన్కి వెళ్ళిన మనిషి ఎంతకీ రావడంలేదు. మనకోసం అందర్నీ అలాగే వదిలెయ్యకుండా.. మన ప్రక్కన కూచున్న వాళ్లందరి విస్తళ్ళలోనూ వడ్డన జరిగిపోతూవుంటుంది. అప్పుడు చొరవగా మనమే వెళ్ళి విస్తరి తెచ్చుకుంటేనే అందర్తో సమానంగా మన విస్తర్లోనూ వడ్డన జరిగి.. భోంచెయ్యగలుగుతాం. నా మాటల్లోని వాస్తవాన్ని నువ్వే నిదానంగా ఆలోచించి తెలుసుకో సుగుణా." సూచనప్రాయంగా స్నేహితురాలికి సలహా ఇచ్చి వదిలింది స్వర్ణ.

❋ ❋ ❋

స్నేహితురాలి దగ్గరకెళ్ళివచ్చిందగ్గర్నుండీ.. దీర్ఘాలోచన్లో పడింది సుగుణ. మొదటగా.. తన బ్రతుకు తెరువుకోసం ఏదైనా పని చూసుకోవాలి. తను పెద్దగా చదువుకోకపోయినా..టైలరింగ్ బాగా



తెలుసు తనకు. కుట్టుసెంటర్లోచేరి.. రకరకాలైన బట్టలు కుట్టి, రెడీమేడ్ షాపుకు అమ్మి..తన పొట్ట తాను పోసుకోగలదు. అప్పుడింక ఈ ఇంట్లోంచి గెంటేస్తానని బెదిరించినా గెంటేసినా... తనకు బాధలేదు. అవును.. తన భవిష్యత్తుకు సరైనబాట తనే వేసుకోవాలి.. తన ఆలోచనల్ని ఇవ్వాల్టినుండే ఆచరణలో పెట్టాలి.."

మనసులోనే స్థిరనిశ్చయానికొచ్చిన సుగుణ లేచిలోనికెళ్లి.."అమ్మా..నేను కుట్టుసెంటర్ కెళ్తున్నాను.." చెప్పేసి ఇల్లు దాటింది.

తమనడక్కుండా ఏనాడూ గడపదాటి బైటికెళ్ళి ఎరుగని కూతురలా స్వతంత్రించి... తమ మాటకోసమన్నా చూడకుండా బైటికెళ్తున్నందుకు.. రామనాధం, జానకమ్మ ఆశ్చర్యపడ్డారు. "ఇంత తెగింపు దీనికెక్కడ్నుంచి వచ్చిందండీ? మొన్న సుబ్బారాయుడు ఇంటికెళ్లి వచ్చిందగ్గర్నుండీ దీన్లో ఏదో మార్పు కనిపిస్తోంది. వున్నదిగా ఆ టక్కులాడి స్వర్ణ.. దీనికేదో నూరిపోసుంటుంది.. కూసే గాడిదొచ్చి, మేసే గాడిదను చెరిపిందన్న సామెతే వుంది గదా... రానీండి.. ఇది ఇంటికొచ్చాక చెబుతా దీని పని.." కోపంతో రుసరుసలాడిపోతోంది జానకమ్మ.

"పోనీలేవే.. ఇరవై నాలుగ్గంటలూ ఇంట్లోవుండాలన్నా పిచ్చి పట్టినట్టుగా వుంటుందెవరికైనా... అది కుట్టు నేర్చుకోడానికేగాని వూరిమీద బలాదూర్ తిరగడానిక్కాదుగా... పైగా ఆ కుట్టుపనేదో బాగా నేర్చుకుందనుకో... ఇంట్లో టైలర్‌కిచ్చే డబ్బు కూడా తగ్గుతుంది మనకు. ఇదిగో జానకీ... అమ్మాయిని మరీ కట్టడి చేశామనుకో... కట్టుబాట్లు తెంచుకు పారిపోడానికి ప్రయత్నిస్తుంది. మనం ఇలాగే చూసీ చూడనట్టు వూరుకుంటే ఏ గొడవా వుండదు. ఐనా ఇంట్లో పనంతా చేసి వెళ్ళింది గదా? ఇంక నీకేంటి ప్రోబ్లం?" భర్త నచ్చచెప్పేసరికి.. తమాయించుకుంది జానకమ్మ.

✳ ✳ ✳

ఆరోజు ఉదయాన్నే ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బైటికెళ్ళిన సుగుణ.. మధ్యాహ్నానికి ఇంటికి చేరింది. రామనాధం, జానకమ్మ కూతుర్ని చూసి మతిచలించిన వాళ్లలా వుండిపోయారు. పెళ్లికూతురు అలంకరణలో, మెడలో తాళితో, ప్రక్కన భర్తతో తమ ఎదుట నిలబడ్డ సుగుణను చూడ్డంతో... ఆ షాక్‌తో ఎక్కడివాళ్ళక్కడే స్థబ్దుగావుండిపోయారు కాసేపు. తేరుకున్న మరుక్షణం.. అమ్మోరి అవతారమే ఎత్తింది జానకమ్మ.

"ఎంతకు తెగించావే పాపిష్టిదానా.. ఇలాంటి కాని పన్జేసి మా పరువు తీసి బజార్న పెడతావా? అసలు ఇలాంటి పన్జెయ్యడాన్కి నీకింత ధైర్యం, తెగింపు ఎలా వచ్చాయే? నడు.. తక్షణం నా ఇంట్లోంచి కదులు... నువ్వసలు నాకు పుట్టనేలేదనుకుంటాను."

"అమ్మా... కన్నవాళ్ళు గదా... మీ ఆశీర్వాదం తీసుకుందామని వచ్చాం. మీకంత కష్టంగావుంటే ఇప్పుడే వెళ్ళిపోతాం. మీరు తలదించుకొనేంత కాని పనేం చెయ్యలేదు నేను. నేనూ వుప్పూకారం తింటూన్న మనిషినే. నాకూ కోరికలు, ఇష్టాలువుంటాయి. వాటికి సమాధి కట్టేసి జీవచ్ఛవంలా బతికానిన్నాళ్ళు. మీరే నా పరిస్థితినర్థం చేసుకుంటారనుకున్నానుగాని, కన్నవాళ్ళే కసాయి వాళ్ళలా మారతారని ఊహించలేదు నేను. మీకన్న కూతురుగా, నేను మీపట్ల బాధ్యతగానే నడుచుకున్నాను. నాకూ భర్త, ఓ ఇల్లు, సంసారం, పిల్లలు కావాలనుకున్నాను. నా పరిస్థితినర్థం చేసుకుని నన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడ్డ ఈయన్ని నా జీవితంలోకి ఆహ్వానించాను..

ఎందుకు నాన్నా అలా చూస్తున్నావు? తల్లిదండ్రులుగా మీరిద్దరూ నాపట్ల ఎప్పుడూ బాధ్యతా రహితంగానే ప్రవర్తించారు. పెరట్లో నాటిన అరటిమొక్క గెలవేసి, అది పక్వానికొచ్చే వరకూ ఎదురుచూసి ఆపైన ఆ మొక్కను నరికి బైటపారేసినట్టు... నేను చేసే చాకిరి పనికొస్తుంది గాని... నేను సుఖపడ్డం పనికి రాదు మీకు. నా మొదటి భర్త ద్వారా సంక్రమించిన ఆస్తులంటే అభిమానం. నేను తిరిగి వివాహం చేసుకుంటే... వాటికి తిలోదకాలొదులుకోవాల్సొస్తుందని మీ బాధ. దానికే అందంగా, విధవకి తిరిగి వివాహంచేసే ఆచారం మన ఇంటా వంటా లేదంటూ, ఈ ఇంట్లో పర్మినెంటు పనిమనిషి ముద్రవేసి పడేశారు నన్ను. గెల నరికేసిన అరటి మొక్కలాగా నేను కూడా ఎందుకూ పనికిరానిదాన్లా పడుండాలని మీ ఆలోచన. ఇంతవరకూ ఎలా బతికినా..ఇహముందు అలా బతకడానికి మనస్కరించకే.. నా జీవితానికీ ఓ అర్థం, పరమార్థం వుండాలని ఆశపడే.. నా దారి నేను చూసుకున్నాను. నేను చేసిన పని మీకు కష్టం కలిగిస్తే... దానికి నేను బాధ్యురాల్నిగాదు.

నన్ను నన్నుగా అర్థం చేసుకుని ప్రేమించే మనిషి నాకు ముఖ్యం. మంచి మానవత్వం వున్న ఈ సుందర్రావుగారు నా మనసుకు నచ్చారు. ఆయన సాహచర్యంలో నా జీవితం సుఖంగా గడిచిపోతుందన్న నమ్మకం నాకుంది. అందుకే.. ఆయన కోరగానే ఆయన అర్ధాంగినయ్యాను. ఇద్దరం కలసి ఓ రెడీమేడ్ బట్టలషాపు పెట్టాలనుకుంటున్నాం. దానికి గవర్నమెంటు లోన్ కూడా శాంక్షనైంది. మయూరి సినిమా థియేటర్ ప్రక్కనే మా ఇల్లు. అమ్మా... నాన్నా మీకెప్పుడు మా ఇంటికి రావాలనిపించినా నిరభ్యంతరంగా రండి. ఇంక మాకు సెలవిప్పించండి.." తల్లిదండ్రు లిద్దరికీ నమస్కరించి భర్తతో ఆ ఇంటి గుమ్మందాటి బైటికొచ్చేసింది సుగుణ.

*

